వితంతువైన కూతురికి
అతనేవిధంగా
మరో వివాహం
జరిపించగలిగాడు?

జోస్యము విద్యాసాగర్ కథ

# నలుపెరిగిన గురివింద

పాములరావుగారికి తాడిపత్రి పట్టణములో మంచి పలుకుబడే కాదు, లెక్కకు రానంత డబ్బూ ఉండేది. ఉండేది అని భూతకాల క్రియ వాడవలసి వచ్చింది ఎందుకంటే ఆ వైభోగమంతా పది పన్నెండేళ్ళ కిందటిమాట కనక! అప్పట్లో బంగారే ఆయన దగ్గర రెండు, మూడుశేర్లుండేదని పుకారు. ఇక వెండి సంగతి చెప్పనే పనిలేదు. ఇంతా చేసి ఆ పాముల రావేం పెద్ద కాంట్రాక్టరు కాదు. రెవిన్యూ ఇన్స్పెక్టరులాంటి రాబడిగల ఉద్యోగస్తుడా అంటే అదీ కాదు. పోనీ తల్లిదండ్రులార్జించి పెట్టినదా అంటే ఊహూ! అది కేవలం స్వార్జితం. పాములరావు దర్జీ పనిచేసేవాడు. కొడుకు పెద్ద బజారులో ఆంజనేయస్వామి గుడికి కొంచెం ఇటు పక్కగా ఉన్న బంకులో... బాడుక్కు తీసుకున్న బంకులో—కుట్టుమిషన్‌ని పెట్టుకుని గుడ్డలు కుట్టేవాడు. ఆ కాలంలో తుక్కోజీరావు దగ్గర గుడ్డలు కుట్టించుకోటమంటే కుర్రాళ్ళకి పెద్ద ఫేషను. తుక్కోజీ రావుకి చేతినిండా పనేకాదు డబ్బుకూడా. పాములరావు మాత్రం ఇంటికి దగ్గరగా 'జిన్ను'ల్లో ఉండే దేవీవిలాస్ వరండాలో అయ్యరు అనుమతితో ఇంకో మెషిన్ కొని అంగడి పెట్టుకున్నాడు. పాతకాలం మనిషి అనీ నెమ్మదస్తుడనీ, చెప్పిన సమయానికి తప్పకుండా ఎదిగిస్తాడనీ పేరు తెచ్చుకోవటం మూలాన ఆయనకు విపరీతమైన గిరాకీ. పాములరావు భార్య భర్త కుట్టిన గుడ్డలకు చేతిపని చేసేది. కాజాలు కుట్టేది. గుండీలు కుట్టే ది. అంతేకాకుండా 'పాముల్రావూ! కొంచెం సక్కూబాయమ్మనంట పంపు మా



అమ్మ వెప్పింది!' అని వచ్చే పిలుపులకు ఆమెపోయి వచ్చేది. అంగడి దగ్గరకు వచ్చి 'లత్తీ' లిచ్చి రవికెలు కుట్టించుకోవటానికి సిగ్గుపడే మధ్యతరగతి వాళ్ళు సదాశివరావులా

ంటె లక్షాదికార్ల ఆడవాళ్ళ గుడ్డలనీ ఆమె తీసుకువచ్చేది. భర్తకుట్టేక, తిరిగి స్వయంగా ఆమెనే పోయి ఇళ్ళిల్లూ తిరిగి ఎవరిది వాళ్ళకిచ్చి కూలీ ఇప్పించుకుని వచ్చేది.

అట్లా ఆ ఇంటిలో అందరూ సంపాదనాపరులే! అందరూ దాచిపెట్టేవారే. అందరూ పొదుపరులే! అందరి ఆశయమూ ఒక్కటే. దుడ్డు కూడబెట్టడం! అప్పట్లోనే తాలూక్కచ్చేరికి ఎదురుగ్గా ఉన్న వాటర్ వర్క్స్ రోడ్డులో కాలువపక్కన పనికిరాక పడివున్న రెండుసెంట్ల భూమిని అగ్గువగా కొని రెండు రూముల ఇళ్ళేసుకున్నాడు. అట్లా ఇట్లా దాచింది నెలకింత చొప్పున, అప్పుడింత ఇప్పుడింతా చొప్పున బంగారం కూడా కొనసాగినారు. కష్టానికి తగినంత కన్నా ఎక్కువగానే రావటం మాత్రమే కాదు. ఖర్చులు బాగా తగ్గించి వేయడంతోను, పట్టిందంతా బంగారం కావడంతో పాములరావు దర్జానే మారిపోయింది. దర్జా మారిపోయిందే కానీ, తాను దర్జీ నన్న విషయము మాత్రమే ఎప్పుడూ మరచిపోలేదాయన.


కాలమెప్పుడూ ఒకటే మాదిరి ఉండదు. ప్రతి మనిషికి జీవితంలో ఉచ్చదశ ఎట్లా తెలియకుండా వస్తుందో అదే మాదిరిగా క్షీణదశకూడా చెప్పాపెట్టకుండా వస్తుంది. ఆ రావడమైనా ఎంత తొందరగా... ఎంత వేగంగ...? కన్నుమూసి తెరిచేలోగా అంతా అయిపోతుంది. అందుకు పాములరావు కూడా తీసికట్టేం కాదు. అట్లే జరిగింది ఆయనక్కూడా.

ఆ దినం పొద్దున... ఎప్పటి మాదిరిగానే తుక్కోజిరావు, తన బీయెస్సే సైకిల్‌కి బాగా మెరుగుపెట్టి పాత గుడ్డతో పదిసార్లు తుడిచి, తల్లి సక్కూబాయమ్మ అందించిన సద్దన్నం మూటని సైకిల్ వెనకాల క్యారియర్ స్టాండులో గట్టిగా పడకుండా ఉంచుకుని పోయినాడు పనికి...! ఆ తర్వాత పాములరావు పోయినాడు. పదిగంటలప్పుడు పని ముగించుకుని కూతురు రుక్మాబాయికి 'జాగ్రత్తల్లీ! వాకిళ్ళు, భద్రంగా వేసి బీగం చేతులు నాయనకివ్వు!'' అంటూ చెప్పి అంగటిలోనే నాయన్దగ్గర కూచుని కాజాలు కుట్టుతూాండు! అని చెప్పి 'నేను పక్కగేరిలో అదేనే జనార్దనమయ్య ఇంటి కెదురుగుండా ఉన్న శేషాచార్ల సామింటికి పోతాన్నాను. అమ్మయ్య దేనికో రమ్మనిందంట. ఆడ పని అయిపోగొట్టేని అంగడి దగ్గర్కొస్తా'' అని చెప్పి, కొంగుని సర్దుకుని వీపునిండా కప్పుకుని అడ్డదారిగుండా పక్కగేరికి బయలుదేరింది. ఆమె చెప్పిన శేషాచార్లుగారు ఆ ఊరి మునిసిపల్ కౌన్సిలర్. ఆ నెలలో ఆయన బిడ్డది పెళ్ళి కుదిరింది. ఆ పెళ్ళి బట్టలు కుట్టమని చెప్పడానికే శేషాచార్లుగారి భార్య ఆండాళమ్మగారు పిలిచింది. 'అ... అ... రామ్మా! సక్కూబాయమ్మా! రారా! ఇంకా రాలేదేమబ్బా! మళ్ళీ చెప్పంపించాల్నేమోను కుంటూాంటే నిప్పుడే...!' అంది ఆండాళమ్మ సక్కూబాయమ్మను చూడగానే. ఆమె కూతురు అలిమేలు మంగతాయారు కొనుక్కువచ్చిన ఖరీదైన గుడ్డలన్నింటిని సక్కూబాయమ్మ ముందర తెచ్చి పడేసింది! 'చూడు బాయమ్మా! ఆ ఎర్రరంగుదుంది చూడు అది ఆ అదే... అది శానా బాగుండాలా! పెద్దచీర మీది మేచింగ్ అది. ఇచ్చిన అర్తీ చూచికుట్టకు. అది లొడంగు బుడంగ్ అని ఉంది. కొలతలు తీసుకో!' అంది అలిమేలు. అన్నీ వాళ్ళు చెప్పినట్లు తీసుకొని చిన్న పేపరులో కొలతలు వ్రాసు

కుని... ఓ పాత పంచెలో మూటకట్టుకుని వెళ్ళిపోవటానికి బయలుదేరు తున్నప్పుడు ఆండాళమ్మ గారన్నారు? చూడు బాయమ్మ ! అన్నీ ఖరీదైనవి. ఎంత లేదన్నా అయిదారు వేల రూపాయలు చేస్తాయి. జాగ్రత్తగా కుట్టాల! పొరపాట్లు వచ్చినా ఏదైనా పోయిం దన్నా టయంలేదు తిప్పికుట్టుకోటానికి. అందుకని మరీ మరీ చెబుతున్నా! వారం రోజుల్లో ఇవ్వాలా ఇస్తావా? చెప్పు. చాతకాద ంటే అనంతపురం పోయన్నా ఇచ్చేస్తాం! నమ్మకంగా చెప్పు ఊ అంటూ అన్నారు. కొత్త కొలతలుపాత జాకెట్లు—గుడ్డలమూట మెడలో ఓపువేసుకుని 'మీరేం దిగులు పడద్దు. నూరారయినా ఆరు నూరయినా వారంరోజుల్లో తప్పక అందిస్తాను. సరా!' అంది సక్కూబాయమ్మ! ఆ వాళ అది అదృష్టమో లేక దురదృష్టమో తెలియదు కానీ, తుక్కోజీరావు క్కూడా అటువంటి బేరమే తగిలింది. అతడు తెచ్చిన గుడ్డల ఖరీదు ఇంచుమించు అంతే ఉంటుంది. విచిత్రమేమంటే పాముల్రావు కూడా అటు వంటి గిరాకీయే దొరికింది. ఆ దినం సాయంకాలానికి తల్లీదండ్రీ కొడుకు తెచ్చిన గుడ్డల విలువ పదహైదు వేల రూపాయలను దాటిపోయింది. పాములరావు అంత సంతో షమును బయటక్కనిపించ నీయకుండా, తన ఇంటిల్లి పాదికి ఎన్నెన్నో సలహాలని ఇచ్చినాడు. ఈ బేరాలలో తమ వంశప్రతిష్ఠ ఆధారపడి వుందని చెప్పినాడు. చెప్పిన పొద్దుకు తప్పక ఇవ్వటానికి రాత్రింబవళ్ళా కష్టపడి పనిచేయాలన్నాడు. ఎక్కడా ఏ పొరపాటు ఏ ఆలస్యంగాని కారాదని చెప్పినా డు.

ఆ సాయంత్రం ఊళ్ళో తేరు దగ్గరున్న 'విఠోబా' దేవాలయానికి అందరూపోయి తమ సంతోషాన్ని కృతజ్ఞతని, ఆ పనిలో ఏమాత్రం తప్పు దొరలకుండా చూడమనీ విఠలస్వామిని మనసారా కోరుకున్నారంతా!

గంట తరువాత ఇంటికి వచ్చిన కుటుం బ సభ్యులకు ఇల్లు మొత్తం దొంగలు



దోచుకుపోయి ఉండటం కనుపించి కుప్పలా కూలిపోయినారు. సక్కూబాయమ్మ పరిస్థితి చెప్పనే పనిలేదు.

అనుభవమూ విజ్ఞత ఉన్న పాములరావు మాత్రం జరిగిందానికి బాధపడకుండా జరుగవలసిన దాన్ని గురించి ఆలోచించ సాగేదు. తమ పేరు ప్రతిష్ఠలకు భంగం రాకుండా కూడబెట్టిందంతా తెగనమ్మి—భార్యమెడలో మంగళసూత్రంతో సహా బంగారం అమ్మి—అంతే ఖరీదుగల అదే మాదిరి గుడ్డలు కొనుక్కువచ్చి కంటికి నిద్రలేకుండా కూచుని కుట్టి సమయానికి అందించి మాట నిలుపుకున్నారు. కట్టుబట్టలు మాత్రం నిలుపుకున్నారు. ఇంటి నాలుగ్గోడలు నిలుపుకున్నారు.

సహజంగా ఆడది గనుక సక్కూబాయమ్మ జరిగిన ఘోరాన్ని తలుచుకుని ఎంతగానో బాధపడిపోయింది. వారం దినాలు అన్నం, నీళ్ళు వదులుకున్నాది. కానీ, పాములరావు మాత్రం ఎట్లా వచ్చిందట్లాపోయింది. దానికి దిగులెందుకు? నేను గట్టి, నా మిషను గట్టి'అంటూ నిర్లిప్తంగా ఉండిపోయినాడు.

ఇంతకీ చెప్పవచ్చేదేమిటంటే పాములరావు సిరి సంపదా అంతా తుడుచుకుపెట్టుకొనిపోయింది అని.

'బాగానే ఉంది. కానీ...' అంటూ నసిగింది సక్కూబాయి భర్తను చూచి.

'అస తుమీకాయ్ సాంగ్తో...!' అన్నాడాయన భార్యనుద్దేశించి, పాములరావు వాళ్ళు పట్టేకార్ కులస్థులు. వాళ్ళకు మహారాష్ట్రం మాతృభాష. పేరుకి మాతృభాషేకానీ, ముప్పయ్యేళ్ళకు పైబడిన తెలుగు సాన్నిహిత్యంతో ఆ ప్రభావంతో వాళ్ళ మహారాష్ట్రమే సాంకర్యం చెందింది. మహారాష్ట్రులు వింటే తెలుగనుకుంటారు. తెలుగువాళ్ళు వింటే మహారాష్ట్రలాగుంటుంది. కానీ, అది వాళ్ళకు మాత్రం తప్ప మూడో మనిషికి అర్థంగాదు. సక్కూబాయమ్మయినా భర్త సాంగత్యంవల్ల అప్పుడో ఇప్పుడో అంతో ఇంతో మహారాష్ట్రాన్ని మాట్లాడగలదేమోగానీ, భర్తకన్నా అధ్వాన్నపు సంకరభాషను పలకగలదేమోకానీ, వాళ్ళ పిల్లలకి అదీరాదు. వాళ్ళది స్వచ్ఛమైన తెలుగు.

'మన ముల్గీ లగన్...'

'పెళ్ళికి ఇపుడేం తొందరా! అయినా దానికేం అడ్డం వస్తాయి?'

'ఏమో? ఎందుకైనా మంచిది. పోయి ఒక్కసారి వాళ్ళను కలిసి వస్తే మేలేమో?'

'ఏం?పోయి... అయ్యా ఇట్లా మా ఇల్లు దొంగలు దోచుకుపోయినారూ? అంతివ్వలేను అని...'


తమాషా ఏమిటంటే ఆ ఆలూమగల సంభాషణ మహారాష్ట్ర భాషలో మొదలవుతుంది. కానీ, అట్లా అట్లా సాగి సాగి వాళ్ళకి తెలియకుండానే చక్కని తెలుగులోకి మారిపోతుంది. ఇంతకీ సంగతేమిటంటే రుక్మాబాయికి, తల్లీ తండ్రీ అనంతపురం పక్కన ఉన్న పామిడిలో ఓ సంబంధం చూచి, నిశ్చయం చేసుకుని వచ్చినారు. ఇంకా ఈ పొద్దో రేపో పోయి ఇచ్చి పుచ్చుకోవడాలు వంటి మిగతా విషయాలు మాట్లాడుకుని వస్తామనుకుంటుండగానే ఈ దొంగతనం జరగడము తరువాత పేరు నిలబడటం

కోసం ఒంటి మీదున్న నగలతో సహా అన్నీ తెగనమ్మివేసి పెళ్ళి బట్టలు తెచ్చి కుట్టివ్వట ంతో మొత్తం పాములరావు పరిస్థితే మారిపో యింది.

''అసానహి...!'' సర్దబోయింది సక్కూ బాయి

'అయితే కాయ్?'

పాములరావు మొండితనము సక్కూబా యమ్మకి తెలియందేమీ కాదు. ఆయన నిజాయితీపరుడు. ఆయన ఇచ్చిన మాట నిలబెట్టుకునే మనిషి. అంతేకాదు. తానెలా ఉంటాడో ఎదుటివారు కూడా తన మాదిరే ఉండాలని కోరుకునేవాడు. కానీ, లోకం తీరువేరు. అట్లా ఎప్పుడూ ఉండదు. ఒప్పందం ప్రకారం తన కూతురిని పామికి లో ఉంటుండే శంభోజీరావు కొడుకు నారాయణరావుకి చేసుకోవలె. కానీ, సక్కూ బాయమ్మ అనే దేమిటంటే... 'వాళ్ళు మన పరిస్థితిని తెలుసుకుని ఉంటారు. వాళ్ళకు అప్పుడు పాములరావు అంటే బాగా ఉన్న ఆసామి. దుడ్డుతోపాటు పలుకుబడివున్నవా డు. రుక్మాబాయి అటువంటి ధనవంతుని కూతురు. కానీ ఇప్పుడో? ఇప్పుడు తమకు ఏమీ లేదు. ఇప్పుడు పాముల్రావు ఏమీ లేనివాడు. రుక్కమ్మ ఏమిలేని వాడిబిడ్డ! అందువల్ల వాళ్ళు తమ మాట నిలబెట్టుకుం టారా? అని ఆమెకు ఈ లోకరీతి బాగా తెలుసు. ఆమె మనుష్యులను మనస్తత్వాలనీ బాగా అర్థం చేసింది. అంతేకాకుండా, ఆమె ఒక తల్లి సగటు తల్లిపడే ఆరాటం ఆమెకూ ఉంది. కూతురి పెళ్ళి ఇప్పుడు అనుకోని ఈ సంఘటన మూలంగా ఏమైనా కుంటుప డిపోతుందా? అని ఆమె అనుమానం. ఇప్పుడే ఆ విషయమేదో తేల్చుకురావటం మంచిదికదాని ఆమె అభిప్రాయం. తీరా ముహూర్తపు ఘడియలు దగ్గర పడినప్పుడు చుట్టాలు పక్కాలు వచ్చినప్పుడు పెళ్ళి పందిట్లో వాళ్ళేదైనా అన్నా... ఈ పెళ్ళి ఇంకో విధంగా మారిపోయినా నగుబాటు పాలైపోయేది తాము కదా అన్నది ఆమె



ఆరాటము. అందుకే ముందుగా అమీతుమీ తేల్చుకోవటం మంచిదని ఆమె సలహా!

తండ్రి మొండి తనము తెలిసిన తుక్కోజీరావు, తల్లి పడే ఆరాటాన్ని కూడా తెలుసుకుని వెంటనే పామిడి పోయి రావటానికే నిశ్చయించుకున్నాడు. పామిడీ చేరవలెనంటే నేరుగా ఆ ఊరినుంచి బస్సులు లేవు. తాడిపత్రినుంచి అనంతపురం పోయి, అనంతపురం నుంచీ బస్సుగానీ, రైలుగానీ తీసుకోవాలా దూరం ఏమీ అంత లేకపోయినా, బస్సుల ఆలస్యం పాసింజరు రైళ్ళ నడకతో చాలా సమయం తీసుకుంటుంది. పామిడిపోయి రావటానికి! ఈ ప్రయాణపు ఇబ్బందులు తెలుసుకుని ఉన్న సక్కూబాయమ్మకి కొడుకు ఆ రాత్రికే రాలేడని కూడా తెలుసుకుంది. మరుసటి నాడుగానీ రాడని కొడుక్కోసరమని ఎదురుచూడటమే లేదు.

సోడా నరసింహులు అంగడికి పక్కనే అనంతపురం నుంచీ వస్తున్న బస్సు ఆగినా, అందులోనుంచీ నీరసంగా తుక్కోజీరావు దిగినా చూడకుండా, ఏదో ఆలోచిస్తూ ఎక్కడో చూస్తూ, అర్జెంటుగా కావాలని ఇచ్చిన వెంకటరామశర్మగారి చిన్నమ్మాయి లంగా కుచ్చులు కుడుతూంది సక్కూబాయమ్మ! అల్లా ఆ ఆలోచనల్లో ఉందో ఏమో, కుడుతున్న వాడిసూది మొన తటుక్కున మధ్యవేలికి పొడుచుకుని చివుక్కున రక్తం చిందితే కుడుతున్న పావడాని తటాలున కింద పడేసి, తలయెత్తి రోడ్డుమీదికి చూస్తూనే, మధ్యవేలిని నోట్లో ఉంచుకుని రక్తాన్ని పీలుస్తూండిపోయింది సక్కూబాయి. అయినా పక్కకు వచ్చి నిల్చున్న అతన్ని అతని ఉనికిని గమనించనే లేదు.

'అమ్మా!...'

'తుక్కూ! నాన్నా! నీవా! పామిడీ నుంచేనా...?'

'అవునమ్మా! నాయన ఏడీ?'

'వస్తాడు 'తల్లం' వాళ్ళయింటి నుంచీ పిలుపువస్తే ఇప్పుడే... అంటూ ఆగిపోయింది ఆమె.

ఏమైంది నాన్నా? ఏమన్నారు నాన్నా? కాయా...? పండా...? అని ఏమేమో అడగాలని ఉంది ఆమెకి. పోయి వచ్చిన కార్యం ఏమైందో... దాని గురించిన వివరాలేమో అడిగి తెలుసుకోవాలన్న ఆత్రుత ఉంది. కానీ, ఎక్కడ... ఏ సమాధానం...? ఎటువంటి బదులు వినివలసి వస్తుందో నన్న భయము ఆమె మనసుని ఆవరించి ఆమెని మాట్లాడనీయకుండా చేసింది. అయితే మాత్రం ఆ కళ్ళు? ఆ కళ్ళు మౌనంగా ఉంటాయా? ఆ కళ్ళు అడక్కుండా ఉంటాయా? అని అడగనే అడిగాయి.

'రుక్కు... రుక్కు ఇంట్లోనే ఉందామ్మా?' అన్నాడు తుక్కోజి.

'ఆ ఉంది నాన్నా? ఎందుకూ?' ఆమెలో అనుమానం భయం, ఆరాటం మూడు కలియ కలుపుకుని ఆమె గొంతుని కదిలించివేసాయి.

''వాళ్ళూ.. వాళ్ళూ...' నసిగాడు తుక్కోజి. ఆ నసుగుడు చాలదూ!? పూర్తిగా చెప్పాల్నా? ఆ మొహంలోని ఆ భావం చాలదూ? విడమర్చి చెప్పాల్నా? అర్థమైపోదూ...? ఆమెకి అంతా అర్థమైపోయింది.

ఆమె ఇటువంటి సమాధానమేదో వస్తుందని ముందే ఊహించి, అది వినటానికి మానసికంగా సిద్ధమయ్యే ఉంది. అందుచేతనే ఆమెలో అనుకున్నంత బాధ, ఆవేశపు ఉప్పెన...

ఆరాటపు వరద కనిపించలేదు. ఆ బడబానలం మాత్రం హృదయాంతర్భాగాన చెలరేగి ఆమె మనసుని కుతకుత ఉడికించి మనుసుని మలమల మాడ్చివేసింది.

'మరి...? మరెట్లారా తుక్కూ?'

'చూస్తాం! ఇంకో సంబంధమే దొరక్కపోతుందా? మన రుక్కమ్మకి పెళ్ళే కాపోతుందా? ఆ'

రుక్కమ్మ పెళ్ళి అంత వైభవంగా చేయాలంటూ ఎన్నో కలలు కన్నారా ఇంటిల్లిపాది. ఆ కలలన్నీ ఇట్లా కల్లలయ్యేటప్పటికి అందరూ అదోమాదిరి అయిపోయారు. అందులోనూ ముఖ్యంగా సక్కూబాయమ్మకు.

అట్లా ఆమె మనసు అల్లకల్లోల మయ్యున్నప్పుడే ఆమె మనసు ఎందుకో జనార్దనశాస్త్రిగారి మీదికిపోయింది.ఆయనని ఒక్కసారి కలిసి వస్తే అనుకుంది. శాస్త్రిగా రెక్కడో ఆమెకు దూరంలో లేరు పక్క గేరిలోనే ఉంటాడు ఆయన జోస్యము చెబుతారు. అట్లా ఇట్లా కాదు అద్భుతంగా చెప్తుతారు. ఏవైనా గ్రహచారాలు బాగులేకపోతే దానికి కావలసిన జపతపాదులు, శాంతి హోమాలు వంటివి చేయిస్తారు. తద్వారా మానసిక శాంతిని ప్రసాదిస్తారు. ఆయన గురించి ఆమె ఎంతో విన్నది. ఎన్నోసార్లు ఆయన ద్వారా శాంతి కూర్చుకున్న వాళ్ళు స్వయంగా చెప్పగా కూడా విన్నది. అందుకే ఇక ఆలస్యం చేయకుండా అనుకున్నదే ఆలస్యంగా ఆయన దగ్గరకు బయలుదేరింది ఆమె!

''రామ్మా! రా!''

'నమస్కారం స్వామి!'

'ఏం పనమ్మా?'

సక్కూబాయమ్మ మొత్తం క్లుప్తంగానూ వివరంగాను విన్నవించుకుంది. ఏదైనా తరుణోపాయం చెప్పమంది.




## క్రెడిట్ కార్డ్

క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టిన ఘనత డైనర్స్ క్లబ్‌కు దక్కుతుంది. ఈ క్లబ్‌ను ప్రారంభించటానికి ముందు ఈ సంస్థ యజమాని రాల్ఫ్ ష్నైడెన్ తన పర్సును ఓ రోజు ఓ రెస్టారెంట్‌లో పోగొట్టుకొన్నాడట— ఆ రోజున అతడి జేబులో చిల్లిగవ్వ కూడా మిగలలేదు— ఏం చేయాలో పాలు పోలేదు. అపుడే అతడికి క్రెడిట్ కార్డు ప్రారంభిద్దామనే ఆలోచన వచ్చి డైనర్స్ క్లబ్‌ను ప్రారంభించాడు! ఆ తర్వాత మరెన్నో బ్యాంకులు, సంస్థలు క్రెడిట్ కార్డును ప్రవేశపెట్టాయి!

—జూపిటర్

'చూడు సక్కూబాయమ్మా' నేను జాతకాలు వేస్తాను. జాతక చక్రాలు వేస్తాను. ముందు జరుగబోయేదేదో చెబుతాను... అయినా..., అయినా నేనేం దేవుడిని కాదుగదా? ఎప్పుడో ఎవరో వ్రాసిన శాస్త్రాల్లోనివి చదివి అక్కడ వ్రాసినవి వల్లించటం తప్ప నేనేం చేయగలనమ్మా! నేనేం భవిష్యత్తులోంకి తొంగి చూస్తానా?.... హు! అదీ ఇదీకాక ఇదంతా... ఇదంతా మనం చేసుకున్న పూర్వజన్మ కర్మమమ్మా ఏదెట్లా జరగవలసి వుందో అట్లా జరగాల్సిందే తప్ప మనమేమీ చేయలేమమ్మా! ఏమీ చేయలేము..!

'పోనీ ఏదైనా గ్రహశాంతి... ఏదైనా జపం...'

'చేస్తాను. నీకు మనస్సుకు శాంతి కలుగుతుందంటే అదీ చేస్తాను. కానీ... కానీ, నాకు మాత్రం అంత నమ్మకం లేదమ్మా...?'

'మీకు మీ మీద నమ్మకంలేదు. కానీ, మాకుంది. మాకు మీ జోస్యమ్మీద బాగా నమ్మకం. ఏదైనా చక్రంవేసి, నా పేరుతో కొంచెం చూసి చెప్పరూ...?' అని ఆగిపోయి ఎడమ చేత్తో కొంగు కొసలని తీసుకుని నెన్నుదుటిని తుడ్చుకుని 'లేక... లేక, మీరు... మీరు కూడా...'

'మీరు కూడా...?' ఏవిటమ్మా ఆగిపోయినావూ? చెప్పమ్మా? ఏదో అడగాలనుకుని సందేహంతో ఆగిపోయినట్లున్నావు? ఏమిటమ్మా అది...'

''ఏమీలేదు ఒకవేళ.. మీరుకూడా మాకు దుడ్డులుగావీ లేదని చిన్న చూపు చూస్తున్నారా?'

'బాయమ్మా! ఎంతమాటన్నావమ్మా?'

నిజంగానే సక్కూబాయమ్మ బాధ చూచి బాగా చలించిపోయినారు శాస్త్రిగారు. అప్పటికప్పుడు జాతకచక్రంవేసి గ్రహాలను.. వాటి వీక్షణలనీ, ఉచ్ఛనీచలనీ, కేంద్రాలు కోణాలనీ, లెక్కవేసేరు. ఎన్నో గుణింతాలు చేసేరు. చేతి వేళ్ళు లెక్క పెట్టుకున్నారు. అరగంట తరువాత తలెత్తి కట్టకడపటికి ఇట్లా అన్నారు ఆమెతో...

'చూడమ్మా...!'

'చెప్పండి స్వామి!'

'చూడమ్మా! నేను ఉన్నది ఉన్నట్లు చెప్తున్నాను. నీకు జాతకం పుట్టినప్పుడు వ్రాసి లేదు కనుక ఇప్పుడు వ్రాయటం కూడా కష్టం కనుక నీ పేరుతో నక్షత్రం చూచి ఆ నక్షత్రం ప్రకారం గ్రహచారం వేసివాను. దాని ప్రకారం ఫలితాలను చెప్తాను. కానీ..., కానీ, ఇక్కడ ఒక్కమాటమ్మా! ఇప్పుడు నేను నీకు చెప్పబోయే ఫలితాలన్నీ రూపాయికి పావలావంతు మాత్రమే తీసుకోవలె! నేను మాత్రం ఎక్కడో లెక్కల్లో తప్పులు చేయనా? చేసుండనా? ఒక్క సెకెండు ఒక్క క్షణం లెక్కల్లో తప్పుపోయినా, అనంతంలో ఆ తప్పు ఎంతో దూరం పోతుంది అంటారు. అందుచేత...'

శాస్త్రిగారు నిష్కర్షగా చెప్పింది విన్నాక సక్కూబాయమ్మకి మరింత నీరసం వచ్చింది. ఆమె స్వామిగారికి పాదాభివందనం చేసి బయటకు నడిచింది. ఆమె మనస్సు ఆమెకు స్వాధీనం లేదు. ఆమె కాళ్ళు ఆమెకు స్వాధీనంలో లేదు.

అయినా అదే విచిత్రం! ఆమె పెళ్ళి ప్రయత్నాలు ఆగలేదు ఆ తరువాత ఆరేడు నెలలు ఎంతో పట్టుదలలో పాముల రావు కూతురి కోసం సంబంధాలు చూసినాడు కుదిరినట్లే అనిపించేవి. అయిపోయిందిలే ఇక అనుకునేట్లుగా ముందుకు సాగేవి. కానెందు చేతో చివరిలో తప్పిపోయేవి. కుదురుతున్నాయని అనిపించినప్పుడంతా సక్కుబాయమ్మ మనసు ఏదో భయంతో గజగజ వణికిపోయేది. ఆమె చెవుల్లో శాస్త్రి గారన్న మాటలే ప్రతిధ్వనించేవి. కుదిరిపోతే ... కుదిరిపోతే... కుదిర్నాక... కుదిర్నాక పెళ్ళయిపోతే... పెళ్ళయినాక... పెళ్ళయి నాక శాస్త్రిగారు చెప్పినట్లు జరిగిపోతే..., అన్న అనుమానం... భయం...

చిట్టచివరికి రుక్మాబాయి పెళ్ళి జరిగిపోయింది. అల్లుడు బాగా చదువుకున్నవాడే! శంకరరావు అని కారు డ్రైవరు. పెండ్లికి శాస్త్రిగారు స్వయంగా వచ్చి ఆశీర్వదించినారు.

'స్వామి...!'

'సంతోషమమ్మా! కూతురి పెళ్ళి చేసేసినావు.'

'కానీ... కానేదో భయంగా ఉంది స్వామి?'

'భయమా! పిచ్చిదానా? భయమెందుకమ్మా? నిజానికి సంతోషం కలుగవలె! పిల్లకు మంచి సంబంధం కుదిరిందికదా!'


'నిజమేకానీ..., మీరు చెప్పిన ఆ మాట ...'

'మాటనా? నేను చెప్పినానా? ఏమ్మాటా? నేనేం చెప్పినాను?'

'అదేనండీ! ఆ పొద్దుమీరు జాతకం చూచి చెప్పినారు.'

'అవునా? చెప్పేనేమో? చెప్పినానో ఏమో? ఆ సమయంలో ఒక్కొక్కసారి నేనేం చేస్తానో నాకే తెలియదు. అవన్నీ నమ్మకు, మరచిపో!'

యాదృచ్ఛికమో లేక శాస్త్రిగారి శాస్త్ర వైదుష్యమో తెలియదుకానీ, ఆయన చెప్పిన



ట్లే హఠాత్తుగా శివరరావుకారు ప్రమాదంలో చచ్చిపోయినాడు. అదివిన్న శాస్త్రిగారు.'' నేనిట్లా చెప్పినానా? నా జోస్యం ఇట్లా అయిందా?' అంటూ బోరున ఏడిచినారు. తమ జ్యోతిష్యం పైన్నే తమకు ఏవగింపు కలిగించేంత ఘోరం విని కుంగి పోయేరు.

అయినా కాలం ఎవరి కోసమని ఆగదు. దాని పరిభ్రమణం అట్లా సాగుతూనే ఉంది. కాకపోతే ఆ కాలపరిభ్రమణం కంటికి కనిపించనిది.

ఆ దినం తాడిపత్రిలో ముఖ్యంగా ఆ వీధిలో ఆ వార్త అట్టుడికినట్లు ఉడికిపోయింది. ఆ వీధిలోని అందరినోట అదేమాట! ఆ వీధిలో అందరూ ఒక చోట గుమిగూడి ఉన్నారు. ఆశ్చర్యం ఏమిటంటే వాళ్ళంతా చేరింది పాములరావు ఇంటి ముందరకాదు. వాళ్ళు చర్చించుకుంటున్నది పాములరావు కూతురు. తిరిగి పెళ్ళి చేసుకుందన్న వార్తని కాదు. వాళ్ళు గుమిగూడింది శాస్త్రిగారింటి ముందు. వాళ్ళు మాట్లాడుకుంటున్నది. ఆ వివాహానికి శాస్త్రిగారంతటి వేదకోవిదులు... శాస్త్ర పారంగతులు... పురోహితులు ఎట్లా తమ సమ్మతిని తెలిపినారని?

గుసగుసలుగా మొదలై చెవులు కొరుక్కోవటంతో పెరిగిపోయిన ఆ కలకలం చివరికి పెద్ద అల్లరిగా రూపుదిద్దుకుంది. నలుగురైదుగురితో మొదలైన ఆ గుంపు ఇప్పుడు ఏభయ్యరవై మందితో పెద్దదయిపోయింది.

అప్పుడే తమ అనుష్ఠానం ముగించుకుని దేవునింటినుంచి బయటకు వచ్చి రుద్రాక్ష మాలను మెడలో వేసుకుంటూ వినిపించిన కలకలం ఏమిటని కూతురిని అడిగినారు శాస్త్రిగారు. ఆమె ఇచ్చిన సమాధానం విని చిరుదరహాసం చేసినారు ఆయను.

'నమస్కారం!' అన్నారు ఆయన బయటకు వచ్చి అక్కడ నిలుచున్న అందరినీ అభిమాన పూర్వకంగా చూస్తూ చేతులెత్తి నమస్కారం కూడా చేసినారాయన.

ఒక్కసారిగా కలకలం ఆగిపోయింది. అందరూ వచ్చిన మాట మరచి అపరశంకర మూర్తి మారిది వెలిగిపోతూన్న ఆ బ్రాహ్మ మూర్తి తేజస్సును చూచి భక్తిభావం పెల్లుబికిపోతే, ఆపుకోలేని కొందరు సాష్టాంగపడి తమ గౌరవాన్ని ప్రదర్శిస్తే ఇంకొంతమంది మనసులోనే మొక్కుకున్నారు. బాహిరికం చేయలేని ఏదో అసమర్థతో అశక్తితో.

'మీ అందరి మూకుమ్మడి రాకకు కారణం తెలుసు కోవాలని ఉంది'

మూగిన జనమంతా ఆ గంభీరస్వరాన్ని విని అట్లా కండ్లప్పగించి చూస్తున్నారేకానీ, కారణం ఇది అని బదులు ఇవ్వలేదు.

'పాములరావు కూతురు... మళ్ళీ పెళ్ళి. ..'

తలను కనిపించనివ్వకుండా, వంగి ఎవరో గుంపులోనుండి భయం భయంగా కట్టకడకు అసలు విషయాన్ని బయటపెట్టినాడు.


'అర్థమైపోయింది. పాములరావు కూతురి భర్త పోయేడు! ఆ చిన్నారి పెండ్లయిన ఆరు నెలలకే తలచెడి పుట్టిల్లు చేరింది. పాపం! ఆ సక్కుబాయమ్మ నా దగ్గరకు వచ్చింది. అడిగింది. మాట సాయం చేయమంది. రెండవ పెండ్లి చేయొచ్చా? అని

అడిగింది. నిజం! నేనే... చెప్పినాను... చేయమని. నేనే సమ్మతి తెలియపరచినాను!

'అయితే ధర్మమే నంటారా?' అన్యాయం కాదా!

'ధర్మం...అధర్మం...! న్యాయం..., అన్యాయం...' అని అదో మాదిరిగా నవ్వినారాయన. మీద వేసుకున్న చిరుగుల ఎర్రశాలువాని కుడిభుజం మీదినుంచి తీసివేసి పక్కనున్న నులకమంచం కోడుకు తగిలించి, ఇంత లావుగా తెల్లగా ఉన్న జందెప్పోగులని, రెండు బొటన వేళ్ళకు వేసుకుని అటూ ఇటూ సర్దుకుని, కళ్ళర మోడ్చి తలని పైకి కిందికీ భావయుక్తంగా ఊచినారాయన.

'ఏది ధర్మం? ఏది న్యాయం??... ముక్కు పచ్చలారని ఆ పసిపిల్ల వైవాహిక జీవితం నాలుగు పూటలతో ఆగిపోవడం న్యాయమా? అది ధర్మమా...? ఆమె ప్రకృతికమైన ప్రలోభాలకు లొంగిపోయి, సాంఘికమైన కట్టుబాట్లకు, అడ్డుగోడలకు ఆగిపోయి, మనసును చంపుకుని కుళ్ళి కుళ్ళి ఏడవటం న్యాయమా...? ఏది న్యాయం? స్త్రీ, పురుషుల కలయిక ఎంత ప్రకృతికమో తెలిసి ఆ కలయికలోని మాధుర్యాన్ని తెలుసుకుని, చవిచూచిన, ఆ చిన్నారి, జీవితాంతము ఉప్పొంగి వచ్చే తన అంతరాంతారాలలోని అగ్నికీలలవంటి ఈ ప్రకృతికమైన భావాల మీద చన్నీరు చల్లుకుని చల్లార్చుకో ప్రయత్నం చేయటం న్యాయమా? ఏది న్యాయము? రహస్యంగా తన శరీర వాంఛలను తీర్చుకోవటం కోసం తప్పుదారులు వెతుకుతూ, పటిష్ఠమైన సాంఘిక వ్యవస్థకే చీడ పురుగుగా దాపురించటం న్యాయమా? ఏది న్యాయం?... ఏది ధర్మం?? చెప్పండి? ఏది న్యాయం?... అందుకే... అందుకే ఇవన్నీ ఆలోచించే నేనే సమ్మతి తెలియచేసినాను. ఆ పాములరావుకాదు. నేను. ఈ పరిణామానికి బాధ్యత వహిస్తున్నాను. ఈ సాహసానికి ఈ విప్లవానికి మీరు ఏ శిక్ష విధించ దలచుకున్నా స్వీకరించటానికి నేను



## కూతురు

ఎదురుగా వస్తున్న కుర్రాడ్ని కోపంగా అడిగింది తాయారమ్మ—

"ఏంటి నన్ను చూసి కన్నుకొడ్తున్నావ్?"

"నిన్ను చూసి కాదాంటీ. నీ వెనకున్న నీ కూతుర్ని చూసి.." తక్కున జవాబిచ్చాడా తుంటరి

—బి.ఎస్.ఎస్.ప్రసాద్ (విశాఖపట్నం)

సిద్ధంగా ఉన్నాను...'' ఆవేశం కొంచెం సేపు ఆరాటం కొంచెం సేపు..., ఆవేదన కొంత తడవు కనిపించి చివరకు పశ్చాత్తాపంతో గొంతుక వణికి పోతే, అంతలోనే స్థిరత్వం తెచ్చుకుని వంగిన నడుముని ఎత్తి ఎదని ముందుకు తోసి నిశ్చయంగా నిర్భయంగా అన్నారు శాస్త్రిగారు.

ఒకటి... రెండు... అయిదు... ఆరు.

ఆ గుంపు నోరు విప్పలేదు. ఆరు నిముషాల తరువాత నే ఎవరో కొందరు మాత్రమే గుసగుసలు ఆడుకున్నారు. మరి కొందరు అర్థం కాక విప్పిన చేతి వేళ్ళని పురి తప్పి గాలిలోకి విసిరి వేసినారు. తమలో తాము ప్రశ్నించుకుంటూ చేతిబొటన వేలిని నిటారుగా ఉంచి పైకి కిందికీ ఏటవాలుగా ఉంచినారు. తర్కించుకున్నారు.

'చెప్పండి...? ఏమిటి మీ అనుమానం?

'ఏమీలేదు. ఈ ధర్మం. ఈ న్యాయం ఎదుటివారికి చెప్పటానికేనా?... లేక...?'

'లేకా...? ఏమిటి...? మీ భావ మేమిటి?'

'ఏమీ లేదు. వెనకటికి ఒక స్వాముల వారు అందరికీ వంకాయలు తినగూడదని చెప్పి ఇంటికి వచ్చి తాను తిన్నాడంట...'

'నాకు సరిగ్గా అర్థం కావటం లేదు!'

'ఏముందీ? గురివిందగింజ...'

''అంటే... అంటే...?' అర్థమైనట్లు అనుమానంగా చూసారు బొమలు ముడివైచి.

'ఆ... ఆ... అదే...! అదే! దానికి మీరేం బదులు ఇస్తారని అడుగుతున్నాం.

'నేను ఏది చెప్పినా శాస్త్రమైనట్లు... నామాట వేదమైనట్లు మీరు గ్రహించి ఆదరిస్తున్నప్పుడు నేను తీసుకున్న ఈ ఏ నిర్ణయమైనా అందరికీ వర్తించేదే!

'అయితే... అయితే, మీ అమ్మాయికి మాత్రం మరో వివాహం చేయకుండా ఇంట్లోనే ఉంచినారేం?'

'మంచి ప్రశ్న వేసేవు నాయనా నీ వెవరివో ఏమోగానీ, అంతేగాదు నీవు యువతరానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వాడివి కూడా కావటం నాకు మరీ ఆనందంగా ఉంది.

అప్పటికీ ఇప్పటికీ నాది ఒకటే మాట! మా చిరంజీవికి వైధవ్యం ప్రాప్తించింది. అంతేకాదు. నేను ఎప్పుడూ ఆ చిరంజీవికి వివాహం చేయటానికి సిద్ధమే. కానీ... కానీ, నాయనా? ఇక్కడ మీకో మాట చెప్పవలసి ఉంది. మీ యువతరంలో రవంత హృదయ వైశాల్యం తగ్గిపోవటం గమనిస్తున్నాను నేను. ఈ మాట చెప్పటానికి నాకు కొంచెం సిగ్గుగానే ఉంది. ఆదర్శాలు మీకు వల్లించటానికి మాత్రమే పనికి వస్తున్నాయి. సమాజంలో పెరిగిపోతున్న కలుపు మొక్కల మాదిరి ఈ దురలవాటులను ఏరి బయట పెట్టేవరకే మీకు ఈ ఆదర్శాలు పనికి వస్తున్నాయి. నేను కాదు. ఎవరో ఇంకొకరెవరో చేయాలి. నాకు మాత్రం కన్యనే కావాలి. కుమారీ మణే కావాలి... నాకు మాత్రం వరదక్షిణ కావాలా.... నాకు సుశీల కావాలి... నాకు కులసాంకర్యం కూడదు.... ఇదీ మీ భావాల సరళి. ఇది మీ మనసు కోనల్లో చెలరేగుతున్న రవళి. ఇటువంటి

మీరు... మీరు... ఇటువంటి కార్యాలకు ముందుకు వస్తారని ఎట్లా అనుకునేది? ఎవరూ ముందుకు రాకపోతే నా మనసులోని ఏ భావమైనా ఏవిధంగా నెరవేర్చగలను?... ఇందరి ముందు ఇప్పుడు చెబుతున్నాను. పాములరావు కూతురే. కాదు నా కూతురు కూడా విధవే! నా కూతురికి క్కూడా పెళ్ళి చేస్తాను. కానీ, కానీ, అంతటి ఆదర్శయువకులు.... ఉంటే ఉండటమే కాదు ముందుకు వస్తే...'

'వస్తే...? వస్తే...? ఎవరికైనా ఇస్తారా?'

"అంటే...?" అడిగిన వారి భావం గ్రహింపుకు రాక రెట్టించి అడిగినారు శాస్త్రిగారు.

'అంటే... ఏమీలేదు. మీకు ఎవరైనా సరేనా? ఏ కులమైనా ఫరవాలేదా...?'

'ఇందిరి ముందు చెప్తున్నాను... అటువంటి వారు వస్తే ఆ వచ్చిన వారెవరైనా సరే ఏ వివరాలు అడగకుండా నా బిడ్డని ఇవ్వటానికి నాకు ఏ అభ్యంతరమూ లేదు.'

'శాస్త్రిగారి గుండె కోసుకువచ్చిన ఆ మాటలు బాణాల మాదిరిగా వచ్చి పురాతన భావాలను దూసుకుపోయినాయి. ఆయనగారి ఆదర్శవంతమైన ఆహ్వానం అందరి హృదయాల్లో నిలిచిపోయింది.

'నేను... నేను మీ అమ్మాయిని చేసుకోటానికి సిద్ధమే! కానీ, నేను మీ కులం వాడిని కాదు!

ఎక్కడో ఎవరిదో కోడి కొక్కొరోకో అంటూ జాముపొద్దు గడిచిందనటానికి గుర్తుగా కూసింది.

నిజమే! పాతజాము గడచిపోయింది. కొత్తజాము వస్తూంది. కొత్తతరం వచ్చి ఈ సంఘంలోని దురలవాట్లనీ దులిపి వేస్తుంది. ఈ సాంఘిక దురాచారానికి స్వస్తి పలికే యువతరానికిసాటి ఇంకొక్కరోక్కో అంటూ ఎలుగెత్తి ఆ వచ్చే కొత్త జాముకు మేలుకొలుపు పాడుతుంది.

అదెంతో దూరం లేదు. అనవతరంవస్తుంది. రావాలి!

*




పాలిష్ పోవాలంటే?

బూట్లను పాలిష్ చేస్తున్నప్పుడు అది వేలికంటి వదలక చాలామంది బాధపడ్తుంటారు! అలాంటివారికో చిన్న చిట్కా. ఇకనుంచి మీ వేలికి పాలిష్ అంటితే చిన్నగుడ్డతోకానీ, దూదితోకానీ కొద్దిగా వేస్‌లైన్ రాసిన తర్వాత తుడిచివెయ్యండి. చాలా తేలికగా పాలిష్ మటుమాయం అవుతుంది. ప్రయత్నించి చూడండిమరి!

—జూపిటర్